



పేదవర్గాల్లో ఆనందం!

- ఇప్పటివరకు 79,470 మందికి డెలివరీ
- రూ.6 కోట్ల 43 లక్షల నగదు ఖాతాల్లో జమ
- కొనసాగుతున్న బుకింగ్స్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సిలిండర్ల పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది ముఖ్యంగా పేదవర్గాల్లో ఎనలేని సంతోషం కనిపిస్తోంది. ఉచితంగా సిలిండర్ లభించడం తమకు ఎంతో ఆసరాగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 5,11756 మంది అర్హులుండగా ఇప్పటివరకు 79470 మంది బుకింగ్ చేసుకోగా డెలివరీ పూర్తి అయ్యింది. దాంతో వీరి బ్యాంకు ఖాతాల్లో రూ.6 కోట్ల 43 లక్షల నగదు జమ అయ్యింది. డెలివరీ అయిన తర్వాత సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న విషయం తెలిసిందే. జిల్లాలో 5,11,756మంది తెలుపు కార్డుదారులు అర్హత సాధించగా, దీనిలో గ్యాస్ కనెక్షన్లు పరిశీలిస్తే హెచ్‌పీసీఎల్ 2,90,280, బీపీసీఎల్ 75,657, ఐఓసీఎల్ 1,45,819 ఉన్నాయి. మొత్తం డెలివరీ అయినవి 79,470 కాగా, దీనిలో ఐఓసీఎల్‌కు చెందినవి 24839 సిలిండర్లు ఉన్నాయి. బీపీసీఎల్‌కు చెందినవి 8299 డెలివరీ కాగా, మిగిలిన వాటిని హెచ్‌పీసీఎల్ కంపెనీ డెలివరీ చేసింది. తర్వాత ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలోని గ్యాస్ బుకింగ్స్ డెలివరీ కొనసాగుతోంది. ఈ పథకానికి అర్హత సాధించామా లేదా అనే అంశంపై లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కేవలం 1967 ట్రోల్‌ఫ్రీ నెంబర్‌కు సంప్రదించి తెలుసుకోవచ్చు. నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగి, టాక్స్ చెల్లించేవారు, పది ఎకరాలు, భూమి కల్గిన వారు, 300 యూనిట్లు విద్యుత్ వినియోగదారులు దీనికి అనర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. సూపర్ సిక్స్‌లో భాగంగా ఈ దీపం-2 పథకంలో లబ్ధిదారుడు సకాలంలో ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తుందని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. ఏమైనా ఇబ్బందులుంటే ట్రోల్‌ఫ్రీ నెంబరు సంప్రదించాలని కోరారు.

తెలుపుకార్డుదారులే అర్హులు : జేసీ

జిల్లాలో ఎల్పీజీ కనెక్షన్ ఉన్న బియ్యం కార్డుదారులందరూ దీపం-2 పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లకు అర్హులని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల అధికారులతో కలిసి దీపం-2 పథకంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకునే ముందు యాక్టివ్ ఎల్పీజీ కనెక్షన్, రైస్‌కార్డు రెండింటికీ లింక్ చేయబడిన గ్యాస్ లబ్ధిదారులందరూ ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులు ఆధార్‌కు అనుసంధానం చేయబడిన ఫోన్ నెంబరుకు సందేశం వస్తుందన్నారు. ఫోన్ నెంబరుకు సందేశం రాకపోయినా లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న బియ్యం కార్డుదారులు, ప్రభుత్వ ఉద్యోగం, పన్ను చెల్లింపుదారులు, పది కంటే ఎక్కువ ఎకరాలు భూమి కలిగిన సగటున ఆరు నెలలకు 300 యూనిట్లు కంటే ఎక్కువ కరెంట్ బిల్లు నమోదు అయ్యే లబ్ధిదారుల మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లకు అనర్హులన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వైసీపీ ప్రభుత్వంలో నష్టాలు ఎదుర్కొన్న పామాయిల్ రైతులకు ఊరట లభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే టన్నుకు రూ.12,500 నుంచి ఏకంగా రూ.19,000కి ధర పెరగడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. గత వైసీపీ పాలనలో ఒకసారి అత్యధిక ధర పలకడంతో భారీ మొత్తంలో కౌలుకు తీసుకున్నారు. తర్వాత పతనమైన ధరతో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఇప్పుడు మళ్లీ మంచిరోజులు వచ్చాయి.

పామాయిల్ రైతులకు ఊరట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలో రూ.5 వేల వరకు పెరిగిన ధర

టన్ను రూ.19 వేల ధర

గండేపల్లి,నవంబరు7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదు సంవత్సరాల కాలంలో ధర హెచ్చు తగ్గుల వల్ల నిలకడలేని ధరలతో రైతులను అయోమయస్థితిలోకి తోసింది. ఒక్కసారి మాత్రం టన్ను రూ.23 వేల అత్యధిక ధర పెరగడంతో అప్పట్లో కౌలు రైతులు ఇదే ధర నిలబడుతుందని ఎకరానికి రూ.లక్ష ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి కౌలుకు తీసుకున్నారు. తర్వాత ఆ ధర దఫదఫాలుగా దిగజారి రూ.12 వేలకు రావడంతో అప్పట్లో కౌలు రైతులు తేరుకోలేని రీతిలో ఊబిలో కూరుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచలంచెలుగా ధర పెరగడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ధర మరింత పెరిగే అవకాశముండడంతో రైతులకు గిట్టుబాటు అందుతుందనే ధీమాను వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా గండేపల్లి మండలంలో సుమారు 12,500 ఎకరాల్లో ఈ ఆయిల్‌పామ్‌ను రైతులు సాగు చేస్తున్నారు. సాగుకు ప్రభుత్వం కూడా ఇప్పుడు ఎరువులు, డ్రిప్‌లైన్ మొక్కలు, రాయితీలన్నీ వేగవంతంగా రైతులకు అందేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందని పలువురు రైతులు అంటున్నారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలో రూ.12,500 నుంచి రూ.19,000కి పెరిగింది. త్వరలో పామాయిల్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన ధరతో ఊరట

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పెరిగిన ధరతో ఊరట కలిగింది. ధర ఇంకా పెరుగుతుందంటున్నారు. రైతుకు గిట్టుబాటు ధరే లభిస్తోంది. వైసీపీ పాలనలో ఒకసారి అధిక ధర చూసి ఎంతో ఆశతో అధిక రేటుకు పొలం కౌలుకు తీసుకుని అప్పులపాలయ్యా. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందనే ధీమా వచ్చింది.



- పిల్లా సత్తిబాబు, రైతు, మల్లేపల్లి

రూ.18 వేలు ఉంటేనే..

ప్రస్తుతం ఉన్న పెట్టుబడులకు టన్ను రూ.18 వేలు పలకకపోతే రైతుకు గిట్టదు. అయితే రూ.19,000 ధర పలకడం సంతోషం. గత పాలనలో రూ.12 వేల ధర పలికింది. అప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధరలో నిలకడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే రైతులను ఆదుకున్నారు.



- గురజాల వెంకన్నదొర, మురారి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి మల్లిఖార్జునరావు

'ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలి'

పెద్దాపురం, నంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.మల్లిఖార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణాభివృద్ధి పథకంలో భాగంగా పెద్దాపురం, జగ్గంపేట ఉద్యానశాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని గురువారం మాట్లాడారు. గ్రామాల వారీగా ఆయిల్ పామ్ సాగుచేసే వారి వివరాలను ఈనెల 10 తేదీ నాటికి అందజేయాలన్నారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను గెలల రేటు రూ.19 వేలకు పెరిగిందన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలన్నారు. వాతావరణ పంటల బీమా ఆధారిత పథకంలో భాగంగా జిల్లాలో జీడిమామిడిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. జీడిమామిడి తోటలు ఉన్న రైతులు రూ.1500 చెల్లించి పంటల బీమాను పొందవచ్చన్నారు. హెచ్‌వోలు ఎస్.సుజాత, లావణ్య, వీహెచ్‌ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

పిల్లల బంగారు భవిష్యత్తుకు..

బడి వైపు ఒక అడుగు

- 14న మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌లు
- ప్రజాప్రతినిధులూ హాజరు
- పిల్లల ప్రగతి, ప్రవర్తన తెలుసుకునే అవకాశం
- నిర్వహణకు సన్నాహాలు



తొండంగి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం, పాఠశాలలో చదువుతున్న తమ పిల్లల ప్రగతిని, ప్రవర్తనను తెలుసుకుని పాఠశాల సక్రమ నిర్వహణకు తల్లి దండ్రులుగా సూచనలు, సలహాలు అందించేందుకు మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహణకు సన్నద్ధమైంది. ఈనెల 14న జరిగే సమావేశం పూర్తి స్నేహపూరిత, పండగ వాతావరణంలో సమావేశం నిర్వహణకు అజెండా విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి మొదలు గ్రామ సర్పంచ్ వరకూ ప్రజాప్రతినిధులు విధిగా సమావేశాలకు హాజరుకానున్నారు. ఇందుకోసం ఇప్పటికే పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అధికారులు వెబెక్స్ ద్వారా సూచనలు అందించారు. పిల్లల రోల్ నుబట్టి సమావేశ నిర్వహణకు నిధులు విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశ నమూనాలు పరిశీలించి అన్నింటి నుంచి సేకరించిన అంశాల ఆధారంగా మెరుగైన సమావేశం నిర్వహించేందుకుగాను విద్యాశాఖ అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఇది సాధారణ సమావేశంలా కాకుండా పేరెంట్స్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అంతా కలిసి ఆహ్లాదకర వాతావరణంలో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో విద్యార్థుల ప్రగతి, ప్రవర్తన గురించి ఆయా తరగతి ఉపాధ్యాయులతో సమావేశమై సమీక్షించేందుకు వీలుంది. తమ పిల్లల గురించి లోతైన అవగాహనకు వచ్చేందుకు వీలుగా పిల్లల ప్రగతి నివేదికను వారి లోపాలను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించనున్నారు. తమ పిల్లలు చదువుపరంగా, సామాజికంగా పాఠశాలలో ఎలా మెలుగుతున్నారన్న విషయం తల్లిదండ్రులకు, వారికి గల లోపాలు లేదా ఇతర ఆంతరంగిక విషయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా వారికి బోధన సాగించేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉండడంతో ఇది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సరైన వేదిక కానుంది. అలాగే సమావేశ నిర్వహణ నిమిత్తం పాఠశాల స్థాయిలో వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా సమావేశం నిర్వహణకు అజెండాను విడుదల చేశారు. దీని ప్రకారం.. ఉదయం 9.30 గంటలకు తల్లిదండ్రులను, వచ్చిన పెద్దలను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించడంతో మొదలవుతుంది. తరగతి వారీ విద్యార్థుల హాజరు, వ్యక్తిగత ప్రగతిని సబ్జెక్టుల వారీగా సబ్జెక్టు టీచర్లు తల్లిదండ్రులకు వివరిస్తారు. విద్యార్థి క్రమశిక్షణ, సమయ పాలన తదితర అంశాలపై వివరించి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలు వివరిస్తారు. 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ తరగతి వారీగా సమీక్ష జరుగుతుంది. దీనిలో కూడా విద్యార్థులకు సంబంధించిన హోంవర్క్, ప్రాజెక్టులు, మిడ్‌డే మీల్, తరగతి సవాళ్లు, విద్యార్థుల సేఫ్టీ, సైబర్ క్రైమ్ తదితర అనేక అంశాలు చర్చిస్తారు. అనంతరం తల్లిదండ్రులకు ముగ్గుల పోటీ తదితర పోటీలు నిర్వహిస్తారు. అనంతరం పాఠశాల నమోదు, డ్రాపౌట్లు, పాఠశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరాలు తదితర అంశాలతో కూడిన పాఠశాల నివేదికను ప్రధానోపాధ్యాయులు ప్రవేశపెట్టనున్నారు. అతిథుల ఉపన్యాసాల తర్వాత వచ్చిన వారంతా పాఠశాల ప్రగతికి సంబంధించి తోడ్పాటు అందించేందుకు ప్రతిజ్ఞ చేస్తారు. వచ్చిన వారంతా పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వివిధ పదార్థాలతోపాటు మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించే శుభదిన్ భోజనం చేయనున్నారు. దీనికోసం ఇప్పటికే ఏర్పాట్లు మొదలయ్యాయి. మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ జరగనుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.



చేబ్రోలులో పవన్ నివాసం వద్ద డిప్యూటీ సీఎం చిత్రపటానికి పాలభిషేకం నిర్వహిస్తున్న పట్టురైతులు

పవన్ చిత్రపటానికి పాలభిషేకం

సమస్యలపై స్పందించినందుకు గొల్లప్రోలులో పట్టు రైతుల ఆనందం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించడంతోపాటు నష్టపోయిన వారికి పరిహారం మంజూరు చేయించినందుకు పట్టు రైతులు హర్షం వ్యక్తంచేస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, పరిసర గ్రామాలకు చెందిన పట్టురైతులు కర్నాటకలోని రామ్‌నగర్ నుంచి తెప్పించుకున్న పట్టుగుడ్ల నుంచి పురుగులు వచ్చినా గూడు కట్టకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా గత ప్రభుత్వం, పట్టుపరిశ్రమల అధికారులు పట్టించుకోలేదని పట్టు రైతులు ఇటీవల ఆందోళన నిర్వహించారు. అదేవిధంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి సమస్యలు తీసుకువెళ్లారు. పట్టురైతులు వినతిపత్రం ఇవ్వకుండానే నష్టపోయిన 86 మంది పట్టు రైతులకు రూ.11 లక్షలకుపైగా నష్టపరిహారాన్ని మంజూరు చేయించి చెక్కు ఇవ్వడమేగాక, 24గంటల వ్యవధిలోనే వారి ఖాతాల్లో సొమ్ములు జమచేయించారు. అదేవిధంగా పట్టుగూళ్లు కట్టకపోవడానికి గల కారణాలపై సెరీకల్చర్ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి నేతృత్వంలో హిందూపురం శాస్త్రవేత్తల బృందాన్ని రప్పించి అధ్యయనం చేయించారు. ఏళ్ల తరబడి తమను ఎవ్వరు పట్టించుకోలేదని, పవన్‌కల్యాణ్ తక్షణం స్పందించారని, నష్టపోయిన రైతులను ఆదుకున్నారని హర్షం వ్యక్తంచేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసానికి చేరుకుని పవన్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును కలిసి పవన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



కేన్సర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

జీజీహెచ్(కాకినాడ), నవంబరు7(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌పై అవగాహన తప్పనిసరని, స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా వ్యాధి నిర్ధారణతో ఆరోగ్యంగా జీవించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినం సందర్భంగా గురువారం వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కేన్సర్‌ని ప్రాథమిక దశలో చేయాల్సిన పరీక్షలపై ప్రజల్లో అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 18 ఏళ్లు నిండిన ప్రజలంతా సర్వేలో పాల్గొని కేన్సర్ లక్షణాలను ముందుగా పరీక్షించుకోవాలని కోరారు. కేన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేక, వ్యాధి నిర్ధారణ జరిగే లోపు ఈ వ్యాధి బారినపడుతున్నారన్నారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, విలేజ్‌హెల్త్ క్లినిక్‌ల్లో పనిచేస్తున్న సీహెచ్‌లు, ఏఎన్ఎం, ఆశాలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ ప్రభాకర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, డీపీఎంవోడాక్టర్ సురేఖ, ఏపీడెమియాలజిస్ట్ డాక్టర్ రవికుమార్, ఆర్ఎంసీ పద్మకుమారి త్రీటౌన్ ట్రాఫిక్ సీఐ రమేష్ పాల్గొన్నారు.



గొల్లప్రోలు టోల్‌గేటు వద్ద హెల్మెట్ ధరించిన వారికి గిఫ్టు అందజేస్తున్న ఎస్ఐ ఎన్.రామకృష్ణ

గొల్లప్రోలులో పోలీసుల ఆధ్వర్యంలో 'హెల్మెట్ పెట్టు.. గిఫ్టు పట్టు'

గొల్లప్రోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకపోయినా, పత్రాలు లేకున్నా జరిమానాలు విధించే పోలీసులు హెల్మెట్‌లు ధరించిన వారికి బహుమతులు అందజేశారు. హెల్మెట్ పెట్టు.. గిఫ్టు పట్టు అనే రీతిలో పోలీసులు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ విక్రాంతపాటిల్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ నౌడు రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనాలకు ఈ చలాన్లు విధించారు. అదే సమయంలో హెల్మెట్ ధరించి వస్తున్న వాహనదారులకు ఎస్ఐ గిఫ్టులు అందజేశారు. హెల్మెట్ ధరించినా తమను ఎందుకు ఆపుతున్నారని కలవరానికి గురయిన వాహనదారులు తమ చేతిలో బహుమతులు పెట్టేసరికి ఆశ్చర్యానికి లోనయ్యారు. హెల్మెట్ ధరించడంతో వాహనదారుల్లో అవగాహన పెంచడంతోపాటు వారిని ప్రోత్సహించడం ద్వారా మిగిలిన వారిని హెల్మెట్ ధరించేలా చేసేందుకే గిఫ్టులు అందజేశామని ఎస్ఐ తెలిపారు.

ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి : కలెక్టర్ షాన్‌మోహన్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధిహామీ పనిదినాల సంఖ్య పెంచడంతోపాటు గ్రౌండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో హౌసింగ్, ఉపాధి హామీ పథకం పనిదినాల సంఖ్య, సీసీ రోడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు వసతులు ఏర్పాటు, మధ్యాహ్నం భోజనం నాణ్యత తనిఖీ తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు, ఏపీడీ, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనిదినాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైన్స్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రౌండ్ లింక్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రతి గృహం మార్చి నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. అలాగే అన్ని ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశం హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్, సీపీవో త్రినాథ్, డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ శ్రీరమణి పాల్గొన్నారు.



డీఎఫ్‌వోగా సాయిరాజేష్

కాకినాడ క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అగ్నిమాపకాధికారి (డీఎఫ్‌వో)గా పోలు మహంతి వెంకటసాయి రాజేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సురేంద్ర పదవీ విరమణ చేశారు. శ్రీకాకుళానికి చెందిన సాయిరాజేష్ 2022-గ్రూప్-1 బ్యాచ్‌కు చెందినవారు. ఆయన సత్తినపల్లి ఏపీ స్టేట్ ట్రైనింగ్ స్కూల్, అడ్మినిస్ట్రేషన్ ట్రైనింగ్ విశాఖపట్నంలో పొందారు. ఆయన మొట్టమొదటి పోస్టింగ్ కాకినాడ జిల్లా డీఎఫ్‌వోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాజేష్ బాధ్యతలు చేపట్టారు.

నేడు నెహ్రూ టీటీడీ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం

జగ్గంపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎన్డీఏ ప్రభుత్వం వల్ల ఇటు మానవ సేవ అటు మాధవసేవ చేసుకునే అదృష్టం తనకు దక్కిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేస్తానని నెహ్రూ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా, అక్కడున్న అవసరాల మేరకు తన పాత్ర ఉంటుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అంటే తనకు ఎంతో మక్కువ అని, ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెంట ఆయన కుమారుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కుటుంబ సభ్యులు, ఆయన అనుచరులు తరలివెళ్లారు.

నేడు కలెక్టర్‌కు విచారణ కమిటీ నివేదిక

కాకినాడక్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 2020 కొవిడ్ సమయంలో జరిగిన నర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతికి పాల్పడి అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కాకినాడ జీజీహెచ్ పరిపాలనా విభాగ మేనేజర్ నరసింగరావుపై విచారణ కమిటీ ఇచ్చిన విచారణ నివేదికను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి శుక్రవారం కలెక్టర్‌కు నివేదించనున్నారు. దీంతో నరసింగరావు చుట్టూ ఉచ్చుబిగుస్తున్నట్టు సమాచారం. నర్సింగ్ పరీక్షల్లో మెరిట్‌లో పాసై అత్యధిక మార్కులు సాధించిన నిరుద్యోగులకు కాకుండా అనర్హుల వద్ద లంచాలు తీసుకుని వారికి ఉద్యోగాలు ఇచ్చారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణకు ఆదేశించగా, తాజా విచారణలో నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. స్థానికులకు కేటాయించాల్సిన ఆ పోస్టులను ముగ్గురు స్థానికేతరులకు లంచం తీసుకుని నరసింగరావు ఉద్యోగాలు కట్టబెట్టారని తేలింది. ఇదేవిధంగా మరికొంతమంది వద్ద నరసింగరావు లంచాలు తీసుకుని ఉద్యోగాలు వేశారన్న కోణంలో తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని విచారణ కమిటీ ఎంక్వైరీ ఫైల్‌లో నివేదించింది. ఆ నివేదికను కమిటీ గురువారం సూపరింటెండెంట్‌కు అందజేసింది. శుక్రవారం కలెక్టర్ అందజేస్తారు.



'కాడెడ్ల బండి' ఇక.. 'షో'బొమ్మ!





పెళ్లిళ్లు, తీర్థాలకు వెళ్లాలంటే ఎడ్లబండ్లపైనే ప్రయాణం

పరుగులు తీయాలి.. గిత్తలు ఉరకలు వేయాలి.. వాగులు దాటి మన ఊరు చేరాలి.. అంటూ సాగుతుంది అలనాటి ఓ సినిమా పాట. పల్లె ప్రయాణ సాధనాలైన జోడెద్లు, వంటెద్దు బండ్లకు ఉండే ప్రాముఖ్యతను అలనాటి సినీ గీతాలు వెల్లడిచేస్తాయి. బస్తీలో ఆడే సినిమాలకు వెళ్లాలన్నా, సమీప గ్రామాల్లో జరిగే జాతర్లకు, తీర్థాలకు వెళ్లాలన్నా ఆరోజుల్లో బండ్లు కట్టుకునే వెళ్లేవారు. బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి అంటూ నేటికీ ఉర్రూతలు ఊగిస్తున్న ఈ పాటలోని పదహారు బండ్ల మాటేమోగాని నేడు పల్లెల్లో ఒక్క ఎడ్లబండీ కానరావడం లేదు. పల్లె పేరు తలుచుకుంటే గుర్తుకు వచ్చే ఎడ్లబండ్లు కనుమరుగైపోతున్నాయి. ధాన్యం, సరుకుల రవాణాలో కీలకమైన ఎడ్ల బండ్లు ఇవాళ టెక్నాలజీ పేరుతో వచ్చిన యంత్రాల తాకిడికి కనుమరుగైపోయాయి. నాడు వైభవాన్ని చాటిన కాడెడ్లు నేడు ఇళ్ల ముందు అలంకారంగా, ఇళ్లలో టేబుళ్లుగా, షో బొమ్మల్లాగా దర్శనమిస్తున్నాయి.







(ఆంధ్రజ్యోతి- రావులపాలెం)

ఒకప్పుడు పల్లెల్లో ఎడ్లబండ్లు అంతర్భాగంగా ఉండేది. ఇంచుమించుగా రెండెకరాలు పొలం ఉన్న ప్రతి రైతు ఇంట ఒక ఎండ్ల బండి ఉండేది. కానీ నేటి యాంత్రిక యుగంలో ఎడ్ల బండ్లు ఉనికిని కోల్పోయాయి. పల్లెల్లో ప్రయాణసాధనంగా ఉండే ఎడ్లబండ్లు వ్యవసాయ పనిముట్లు చేరవేయడం మొదలుకొని పండిన పంటను ఇంటికి చేరవేసే వరకు కీలకపాత్ర పోషించేవి. పెళ్లిళ్లు, పేరంటాలు, సినిమాలు, షికార్లు, తీర్థాలు, నాటకాలు, వనభోజనాలతోపాటు ఆఖరికి పొలాలకు కూలీలను తరలించడానికి సైతం ఎడ్లబండ్లను వినియోగించేవారు. బండెనకబండి పదుల సంఖ్యలో వరుసుగా వెళ్తుంటే చూడటానికి రెండు కళ్లు సరిపోయేవికావు. ఎడ్లబండిపై ఊరు ఊరంతా తరలివెళ్లిన సంఘటనలు తీపిగుర్తులుగా మిగిలిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రహదారులు ఉండేవికావు. పుంతరోడ్లు, మట్టిరోడ్లు ఉండేవి. రహదారి సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండ్లనే వాడేవారు. మైళ్ల దూరం వెళ్లాల్సి వచ్చినప్పుడు పదుల సంఖ్యలో బండ్లలో వెళ్లేవారు. దీంతో దూరం నుంచి చూస్తే రైలు పెట్టెలా కనువిందు చేసేది. ఎడ్లబండ్లో కూర్చున్నవారు వర్షానికి తడవకుండా ఎండతగలకుండా గూడు కట్టేవారు. బండికి ముందుభాగంలో తొట్టె ఉండేది.. అందులో ఎండుగడ్డి, పచ్చిగడ్డి, దాణాలను ఎడ్ల మేత కోసం ఉంచేవారు. కొత్తగా పెళ్లైన్న కూతురిని అత్తవారు ఇంటికి పంపాలన్నా, పుట్టింటికి తీసుకురావాలన్నా ఎడ్లబండినే ఉపయోగించేవారు. ఆఖరికి గ్రామాల్లో ఎవ్వరికైనా జబ్బు చేస్తే ఎడ్లబండే ఎమర్జెన్సీ అంబులెన్స్ సర్వీస్.

సవారీ బండి... బెంజ్‌తో సమానం..

అప్పట్లో ధనవంతులు జమీందార్లు వాడిన సవారీ ఎడ్లబండి నేటి బెంజ్‌కారుతో సమానమని వృద్ధులు చెబుతున్నారు. సవారీ బండి సవారీ ఎడ్లతో గజ్జలమోతతో వేగంగా దూసుకెళ్లేది. అప్పట్లో వాహనాల శబ్దాలు లేకపోవడంతో గజ్జలమోత కిలోమీటర్ల మేర వినిపించేది. సవారీబండి టేకు కలపతో సుందరంగా తయారుచేయించేవారు. పలు డిజైన్లలో ఆకట్టుకునే విధంగా ఈ బండి అందంగా ఉండేది. పైన అందమైన గూడు, లోపల మెత్తటి పరుపు కూడా ఉండేది. అప్పట్లో ఈ సవారీ బండ్లపై పెళ్లికొడుకు, పెళ్లికూతురు వస్తే వారు ధనవంతులుగా భావించేవారు. అంటే సవారీబండి ఓ విలాసం.

ఎడ్లను బట్టి స్పీడ్.....

బండ్ల వేగం దానికి కట్టిన ఎడ్లను బట్టి ఉండేది. ప్రధానంగా ఒంగోలు, దేశవాళి, మైసూర్ ఎడ్లను కట్టేవారు. వీటిలో ఒంగోలు, దేశవాళి ఎడ్లు ధృడంగా ఉండి ఎంత బరువునైనా అలవోకగా మోసేవి. మైసూర్‌ఎడ్లు వేగంగా పరిగెత్తేవి. వీటికి మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం కొత్త కొత్తమోడల్ బైకుల గురించి ఎలా మాట్లాడుకుంటున్నామో ఆ రోజుల్లో ఎడ్లు, ఎడ్ల బండ్ల గురించి వాటి విశేషాలు ఆసక్తిగా చర్చించుకునే వారు. సంక్రాంతి పండుగ ఎడ్లపందాలకు మంచి క్రేజ్ ఉండేది. ఇప్పటికీ అక్కడక్కడ ఎడ్ల పందాలు పోటీలు జరుగుతూనే ఉన్నాయి.

సాగులోనూ కీలకమే...

సాగు ప్రారంభించిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చేవరకు రైతునేస్తంగా ఎడ్లబండ్లు ప్రముఖ పాత్రపోషించేవి. వరినాట్లు మొదలు ఎరు వులు, కూలీలను తీసుకెళ్లడం, పంటను ఇంటికి చేర్చడం వరకు కీలకపాత్ర పోషించేవి. కాలక్రమేణ అవి కనుమరుగైపోయాయి. యంత్రాలు, ఆధునిక పనిముట్లు రావడం, కష్టం తక్కువగా ఉండడం, పని తొందరగా అయిపోవడంతో రైతులు కూడా యాంత్రీకరణ వైపు మొగ్గుచూపారు. దీంతో ఎడ్లబండ్ల తయారీదారులు ఉపాధి కరువై వేరే వేరే వృత్తుల వైపు వెళ్లిపోయారు. ఎడ్ల బండి చేయాలంటే ఇప్పుడు చాలా కష్టసాధ్యం. చేసేవాళ్లు సైతం అరుదనే చెప్పాలి.

ఒంటెద్దు బండ్లు..

వ్యవసాయ పనులకు రెండెడ్ల బండ్లు కీలకమైతే ఆరోజుల్లో గోదావరి జిల్లాలో ప్రజల రవాణాకు గుర్రపు బండ్లు ఉపయోగపడేవి. వీటి కోసం గ్రామాలు, పట్టణాల కూడళ్లలో స్టాండ్లు కూడా ఉండేవి. ఇక నిత్యావసరాలు మొదలుకొని సరుకు రవాణాలో ఒంటెద్దు బండ్లు కీలకంగా ఉండేవి. ఒకే ఎద్దుతో ఈ బండ్లను లాగించేవారు. ఏదైనా కిరాణా దుకాణాలకుగాని, సంతలకుగాని సరుకు వెళ్లాలంటే ఒంటెద్దు బండ్లే ప్రధాన ఆధారంగా ఉండేవి.

షో... బొమ్మల్లా మారి..

కాడెడ్ల బండ్లు కనుమరుగవ్వడంతో వాటి జ్ఞాపకాల కోసం బజార్‌లో దొరికే కలపతో తయారుచేసిన ఎడ్లబండి బొమ్మలను ఇంట్లో పెట్టుకుంటున్నారు. చిన్న, పెద్ద సైజుల్లో ఎద్దులు, బండి అచ్చుగుద్దినట్టు ఎడ్లబండిలానే తయారుచేసిన బొమ్మలకు క్రేజ్ పెరిగింది. ఇలా కొందరు షోకేసుల్లో బొమ్మల్లా పెట్టి ఆనందిస్తుండగా, మరికొందరు టేబుళ్లగా చేయించుకుని వాడుతున్నారు. కాడెడ్ల బండ్లను ధరలు రూ.6,500 నుంచి రూ.25 వేల వరకు వాటి నాణ్యత, సైజు, మోడల్ బట్టి విక్రయిస్తున్నారు. అలాగే ఇళ్లలో వాడే సెంటర్ టేబుళ్ల రూపంలో తయారుచేసిన బండ్లను రూ.25 నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదిగాకుండా పూర్వం ఎడ్లబండ్లగా వాడిన పాత బండ్లను రంగువేసి అందంగా అలంకరించి ఇళ్ల ముందు కొందరు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా నగరాల్లో ఈ కల్చర్ బాగా పెరిగింది.

జగ్గన్నతోట ప్రభల తీర్థానికి గత ఏడాది ఎడ్ల బండ్లపై వస్తున్న జనం




పదండి పోదాం... ప్రభల తీర్థానికి..

450 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల తీర్థం చూసేందుకు అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నలుమూలల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా వంట సామగ్రితో ఎడ్లబండిపై వచ్చేవారు. ఈ జగ్గన్నతోట ప్రభల తీర్థంలో తిరిగి అక్కడే వండుకుని తిని తిరిగివెళ్లేవారట. అయితే ఈ సంప్రదాయం కొనసాగుతున్నా ఎడ్లబండ్లు మాత్రం తగ్గాయి. అయినప్పటికీ ఇప్పటికీ కొందరు ఎడ్ల బండ్లపైనే తీర్థానికి వస్తుండడం విశేషం. కొబ్బరాకులతో వేసిన గూడు బండ్లలో రావడం కన్నులపండువగా ఉంటోంది.





కలర్ డాప్లర్ పరీక్ష...



అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఎక్స్‌రే యంత్రం

వ్యాధి నిర్ధారణలో కీలకంగా..

నేడు వరల్డ్ రేడియాలజీ డే

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యాధి నిర్ధారణలో కచ్చితత్వాన్ని తెలియజేసే విషయంలో రేడియాలజీ విభాగం పాత్ర కీలకం. 1895, నవంబరు 8న జర్మనీకి చెందిన విల్‌హెమ్ కాన్‌రాడ్ రాన్‌జెన్ అనే శాస్త్రవేత్త ఎక్స్‌రేను కనుగొన్నాడు. తద్వారా వ్యాధి నిర్ధారణకు అనేక పరికరాలు వచ్చాయి. అందువల్ల ప్రతిఏటా నవంబరు 8న ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల ఆర్యోగ ప్రదాయినిగా ఉన్న కాకినాడ జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగం అతి ముఖ్యమైనది రోగులు లేదా క్షతగాత్రులు లేదా గర్భిణులు ప్రతిరోజూ 3500 మంది నుంచి 4 వేలమంది వరకు వస్తూ ఉంటారు. వారిని మొదట వైద్యుడు పరీక్షించి రోగ నిర్ధారణ కోసం పలు ఎక్స్‌రే పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారు. ఆ పరీక్షల నివేదిక ఆధారంగా వారికి వైద్యుడు ఇన్‌పేషెంట్‌గా గానీ, అవుట్‌పేషెంట్‌గాగానీ కచ్చితమైన చికిత్స అందించేందుకు వీలు కలుగుతుంది. అందువల్ల జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగ సేవలు కీలకంగా మారాయి. జీజీహెచ్‌లో ఐదు ఎక్స్‌రే ప్లాంట్‌లు, 12 మొబైల్ ఎక్స్‌రే ప్లాంట్‌లు, 5 అల్ట్రాసౌండ్ పరికరాలు, 2 కలర్‌డాప్లర్ పరికరాలు, ఒక సిటీ స్కాన్ యంత్రం, ఒక ఎంఆర్‌ఐ స్కాన్ యంత్రం అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాల ద్వారా ప్రతిరోజూ 800 మందికి రోగనిర్ధారణ చేయగలుగుతున్నారు. ఎంఆర్‌ఐ స్కాన్‌లో బ్రెయిన్, స్పైన్‌లో అసాధారణమైన నిర్ధారణను కచ్చితత్వంగా తెలియజేస్తుంది.



సాధారణ ఎక్స్‌రే

అన్ని పరీక్షలు అందుబాటులో..

కాకినాడ జీజీహెచ్‌లో అన్ని రకాల ఎక్స్‌రే పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ రేడియాలజీ దినంలో భాగంగా ఈ ఏడాది 'కనిపించని దాన్ని చూడగలగడం' అనే నినాదంతో ఈ డేను నిర్వహించదలిచాం. రేడియాలజీ విభాగానికి చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. మానవ అవయవాల్లో ఎంత చిన్న డిసీజ్ ఉన్నా పసిగట్టగలిగేవి రేడియాలజీ సేవలే. ముఖ్యంగా సున్నితమైన గర్భిణికి ఎటువంటి ఎక్స్‌రే కిరణాలు ఎఫెక్ట్ అవ్వకుండా అల్ట్రా సౌండ్ పరికరంతో పరీక్ష చేసి కచ్చితమైన నిర్ధారణ చేయవచ్చు. మెరుగైన సేవలందించేందుకు మరిన్ని అడ్వాన్స్‌డ్ అల్ట్రా సౌండ్ పరికరాలు అవసరం. ఇప్పటికే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి ద్వారా కలెక్టర్‌కు పరికరాల అవసరత గురించి విన్నవించాం. జీజీహెచ్‌లో ఎక్స్‌రే మిషన్‌లు, ఫ్లోరోస్కోప్ మిషన్లు, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ యంత్రం తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. పేదలు రేడియాలజీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. **- డాక్టర్ అనురాధ, రేడియాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్**





46 సంవత్సరాల క్రితం తాము చదువుకున్న తరగతి గదిలో అప్పటి విద్యార్థినులుగా పూర్వ విద్యార్థినులు

60 ఏళ్లొచ్చినా.. అదే అల్లరి!

● అనపర్తిలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

అనపర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దలు పిల్లలైపోయారు..ఆనందంతో గంతు లేశారు.. ఆడారు.. పాడారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు.. ఇదేదో 30..40 ఏళ్ల పూర్వ విద్యార్థినులు కాదండోయ్.. సుమారుగా 60 ఏళ్లవాళ్లంతా కలుసుకున్నారు. తమ తరగతిలో కూర్చుని ఆ నాటి తీపిజ్ఞాపకా లు నెమరువేసుకున్నారు.. ఈ మధుర జ్ఞాపకాలకు అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల గురువారం వేదికగా మారింది. 1977-78లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినులు పాఠశాలలో గురువారం కలుసుకున్నారు. ఏమేవ్ ఏంచేస్తున్నాం.. గుర్తున్నాయా ఆ రోజులు.. నువ్వు ఢిల్లీ వెళ్లి కప్ తెచ్చావా మరచిపోయావా.. ఇదిగో నీ కప్పు అంటూ ఆనాటి 46ఏళ్ల తరువాత ఆ కప్ అందించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాసేపు తమ తరగతి గదిలో కూర్చుని ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుని.. ఒకరికొకరు ఫొటోలు తీసుకుని మళ్లీ కలుద్దాం.. సెలవంటూ భారంగా సాయంత్రం ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. పాఠశాలకు ఆర్థికసాయం అందజేస్తామని చెప్పారు. కొవ్వూరి సరస్వతి కృషితో జరిగిన ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు సుబ్బలక్ష్మి, సత్యవతి నిర్మల, సుజాత, జయశ్రీ హాజరయ్యారు.



తమ స్నేహితులను సెల్‌ఫోన్‌లో చిత్రిస్తూ స్నేహితురాలు బిజీ బిజీ



చదువుకునే రోజుల్లో గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి వెళ్లి క్రీడా పోటీల్లో పాల్గొన్న స్నేహితురాళ్ల సంతోషాలు

11 నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు

● కల్యాణ సంతాన గోపాలుడిగా ప్రసిద్ధి

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 11వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణ, సంతాన గోపాలుడిగా ప్రసిద్ధిగాంచిన ఈ స్వామి ఉత్సవాలు 18వ తేది వరకూ జరుగుతాయి. 11వ తేదిన ఉదయం విశ్వక్సేన పూజ, స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహిస్తారు. 12వ తేదిన స్వామి, అమ్మవార్లకు అర్చనలు, వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి సేవా సమితి మహిళా భక్త సమాజంచే కల్యాణ అలంకారం, గజవాహనంపై గ్రామోత్సవం, సాయంత్రం 6గంటలకు ధ్వజారోహణం, రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతాయి. 13వ తేదిన స్వామి, అమ్మవార్లకు అర్చనలు, శేషవాహనంపై గ్రామోత్సవం, 14వ తేది సాయంత్రం సదస్యం, పండిత సభ, రాత్రి స్వామి రథోత్సవం, 15వ తేదిన ఆలయం వద్ద చక్రస్నానం, గరుడ వాహనంపై గ్రామోత్సవం, 16వ తేదిన స్వామికి శ్రీపుష్పయాగం, 17,18వ తేదిల్లో 2,3వ రోజు పుష్పయాగాలు నిర్వహిస్తారు. యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈవో నున్న శ్రీరాములు, అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్‌లు కోరారు. కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు.





పిఠాపురంలోని వేణుగోపాలస్వామి దేవస్థానం, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

టీటీడీ సభ్యుడిగా

మునికోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితుడైన అక్కిన ముని కోటేశ్వరరావు గురువారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్, కొంతమంది సభ్యులు బుధవారమే ప్రమాణ స్వీకారం చేయగా, గురువారం కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు. తాను ఊహించని విధంగా తనకు స్వామికి సేవ చేసే అవకాశం వచ్చిందని, మంచిగా సేవ చేస్తానని ఆయన తెలిపారు.



మునికోటేశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహా పర్వదినాలు ఆరవవరోజు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని, స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్థంభంవద్ద ఆకాశదీప పూజలలోనూ, కార్తీక దీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించి న జ్యోతిర్లింగార్చన పూజలలో భక్తులు పాల్గొన్నారు.



జ్యోతిర్లింగార్చన దృశ్యం



అయోధ్యనగర సీతారామ ఫౌండేషన్ ట్రస్టుకు అందజేసిన సీతారామలక్ష్మణుల పంచలోహ విగ్రహాలు

అయోధ్య రాములోరికి

పంచలోహ విగ్రహాలు

● అందజేసిన మండపేటవాసి శ్రీనివాసరావు

మండపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం మారేడుబాకకు చెందిన వాసా శ్రీనివాసరావు దేవాలయ విగ్రహాలు తయారు చేసే శిల్పి అయోధ్య బాలరాముడు 25 కిలోల పంచలోహ విగ్రహంను గురువారం అయోధ్యకు పంపించారు. 16అంగుళాల ఎత్తు 20కిలోల పంచలోహలతో విగ్రహంను తయారుచేశారు. అయోధ్య నగర సీతారామా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రి అయోధ్యరాముడికి బాలరాముడిని పంపించామని శ్రీనివాసరావు తెలిపారు. అలాగే అయోధ్యలో చల్లా శ్రీనివాసశాస్త్రి గత ఆరేళ్లనుంచి నిర్వహిస్తున్న ట్రస్టుకు సంబంధించి అయోధ్య రాముడు సూర్యవంశంకు చెందిన ఆలయంను నిర్మిస్తున్నారు. వాసా శ్రీనివాసరావు దంపతులు శ్రీసీతారామచంద్ర లక్షణ, హనుమాన్, 90 కిలోలతో తయారుచేసిన పంచలోహ విగ్రహాలు అందజేశారు. అయోధ్యకు ఉత్సవ మూర్తుల విగ్రహల అందజేసిన కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు విసాయికుమార్‌బాబు, వేగుళ్ల అజయ్‌బాబు విగ్రహలను ట్రస్టీకి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరాజు, ఎంపీఎస్ చిన్నారావు, వాసారవికిరణ్, శిరంగు ఈశ్వరరావు, బండి గోవిందు పాల్గొన్నారు.



బాలరాముడు విగ్రహాన్ని ట్రస్టుసభ్యులకు అందజేస్తున్న అజయ్‌బాబు


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి
రూ.2 లక్షలు విరాళం

ఆత్రేయపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి గూడపాటి రాంబాబు-నవ్య, గూడపాటి త్రివేది-దుర్గారాణి దంపతులు గురువారం రూ.2 లక్షలు విరాళం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,09,207 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి శ్రీనివాసరావు

రేపు 'నన్నయ'లో జాతీయ శతాధిక కవి సమ్మేళనం

దివాన్‌చెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు తెలిపారు. గురువారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నన్నయ వర్శిటీ తెలుగు శాఖ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మేళనానికి ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిశాల నుంచి 150 మంది కవులు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ, అధ్యాపకులు తలారి వాసు, పి.వెంకటేశ్వరరావు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకుడు పీవీవీ సంజీవరావు పాల్గొన్నారు.


ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు, బ్యాగ్

మధురపూడి విమానాశ్రయంలో
కలకలం

అరు బుల్లెట్లతో ప్రయాణికుడు అరెస్టు
కేసు నమోదు
కొనసాగుతున్న దర్యాప్తు

కోరుకొండ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయంలో బుధవారం రాత్రి ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు తీవ్ర కలకలం రేపాయి. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయానికి బుధవారం రాత్రి విజయవాడకు చెందిన ఎం.సుబ్బరాజు హైదరాబాద్ వెళ్లేందుకు వచ్చాడు. ఆయన తన లగేజ్‌తో టెర్మినల్ భవనం లోకి వెళ్లే సమయంలో ఆయన వద్ద బుల్లెట్లు ఉన్నట్టు స్కానింగ్‌లో వెల్లడైంది. వెంటనే అప్రమత్తమైన ఎస్‌పీఎఫ్ సిబ్బంది ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బుల్లెట్లు స్వాధీనం చేసుకుని బుధవారం అర్ధరాత్రి కోరుకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే తనకు లైసెన్స్ గన్ ఉందని, తుపాకీ లోడ్ చేస్తున్న సమయంలో కొన్ని బుల్లెట్లు తన వద్ద ఉండిపోయాయని వాటిని చిన్న బ్యాగ్‌లో ఉంచి మర్చిపోయానని సుబ్బరాజు పోలీసులకు తెలిపాడు. బుల్లెట్లను, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయ నిబంధనల ప్రకారం బుల్లెట్లతో ప్రయాణించడం, దానికి తగిన అనుమతులు తీసుకోకపోవడంతో ఆయనపై గురువారం ఉదయం కేసు నమోదు చేసినట్టు కోరుకొండ ఎస్‌ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. బుల్లెట్లు స్వాధీనం చేసుకుని సుబ్బరాజుకు స్టేషన్ బెయిల్ ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దర్యాప్తులోని అంశాలను అనుసరించి తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు
భావన ఎంపిక



అంతర్వేది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మోరిలోని జాన సుబ్బమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చెల్లుబోయిన భావన అండర్-14 బాలికల హైజంప్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. డిసెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని హెచ్‌ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్, దివ్యలను సర్పంచ్ లక్ష్మీపద్మమంగతాయారు భగవాన్, అలివేలుగంగాత్రివేణి నాని, జాన శంకరరావు, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.




విద్యార్థినుల నృత్య ప్రదర్శన

జ్యోతిప్రకాశనంతో సదస్సును ప్రారంభిస్తున్న శాంతిశ్రీ ధూళిపూడి పండిట్, ఆచార్య శ్రీనివాసరావు, డాక్టర్ రామారెడ్డి

తెలుగు వైభవాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేయాలి

ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్

దివాన్‌చెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు వైభవాన్ని భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలకు తెలియజేయాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, కళాశాల ఆంగ్ల విభాగం, విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగే సాంస్కృతిక వైభవం-సదస్సును గురువారం అతిథులు జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ దేశంలో భాషాభిమానం ఎక్కువగా ఉన్న వారిలో తమిళనాడు మొదటి స్థానంలో ఉందన్నారు. తెలుగు వారు అటువంటి భాషాభిమానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. నిద్రాణమైన జాతిని జాగృతం చేయడం కోసం గత వైభవస్మరణం ఎంతో అవసరమన్నారు. కందుకూరి, గురజాడ వంటి మహనీయులు మన సంస్కృతిలో భాగమన్నారు. అటువంటిమహనీయులను స్మరించుకుంటూ భావితరాలకు మన సంస్కృతిని అందించాలని సూచించారు. భాష, సంస్కృతి, కథన శక్తిని అందరూ పెంపొందించుకోవాలని కోరారు. నన్నయ ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు మాట్లాడుతూ మన ప్రాంతంలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడానికి ఈ సదస్సు చక్కని వేదిక అవుతుందన్నారు. 'జ్ఞానమంటే డిగ్రీ కాదోయ్... జ్ఞానమంటే ప్రపంచానికి ఉపయోగపడే యువశక్తిని తెలియజేయడమే' అన్న గురజాడ మాటలను ఆయన గుర్తు చేశారు. కాప్స్ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో ఉపాధి అవకాశాల నేపథ్యంలో సామాజిక అంశాలను విస్మరిస్తున్నారన్నారు. సదస్సులో నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి, కాప్స్ ఉపాధ్యక్షుడు ఆచార్య జి.నాగేశ్వరరావు, అటవీ శాఖ విశ్రాంత అధికారి నళినీమోహన్, సదస్సు కన్వీనర్లు ఆచార్య కె.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి మాట్లాడారు. మధ్యాహ్నం జరిగిన సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు పరిశోధనా పత్రాలను సమర్పించారు. అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీనటరాజ నిలయ చర్మచిత్ర కళాకారుల తోలు బొమ్మలాట ఆకట్టుకున్నాయి.

జీఎస్ఎల్ వైద్య కళాశాలలో
సిమ్యులేషన్ వర్క్‌షాప్


సిమ్యులేషన్ ల్యాబ్‌లో విద్యార్థులకు వైద్య పద్ధతులను వివరిస్తున్న వైద్యులు

రాజానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌కేర్ సిమ్యులేషన్ సొసైటీ (ఎస్‌హెచ్‌ఎస్) నిర్వహిస్తున్న 6వ వార్షిక హెల్త్‌కేర్ సిమ్యులేషన్ కాన్ఫరెన్స్, సిములకాన్-2024 వేడుకలు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. సదస్సు సమన్వయకర్త డాక్టర్ గన్ని సందీప్ విలేకరులతో మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లు హెల్త్‌కేర్ విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించేందుకు రూపొందించామన్నారు. ఆరోగ్య విద్యలో ప్రాక్టికల్ స్కిల్స్‌ని మెరుగుపర్చడం, సిమ్యులేషన్‌లో కొత్త ప్రయోగాలను అందించడం మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు లక్ష్యమని చెప్పారు. మొదటి రోజు వర్క్‌షాపుల్లో దేశవ్యాప్తంగా 200 మంది డెలిగేట్లు పాల్గొన్నారు. మిగిలిన రెండు రోజుల కాన్ఫరెన్స్‌లకు మరో 600 మంది హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు వీఎస్ మహాలక్ష్మి, దినకర్, లూలు షరీఫ్, ఈ.రాజ్‌కుమార్, మోహన్ మహారాజ్, జేజే డేవిడ్, అచ్యుత్, గోంగడ, ఎల్లపు రామునాయుడు పాల్గొన్నారు.

2,21,536

పట్టభద్రుల ఓటు హక్కుకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు
ఈనెల 23న ముసాయిదా జాబితా
వచ్చే నెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం
వచ్చే నెల 30న తుది జాబితా విడుదల

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదుకు భారీఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 6వ తేదీ వరకు నమోదు చేసుకున్న వారి పేర్లను ఈ నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ప్రచురించనున్నారు. ఈ నెల 7 నుంచి 23వ తేదీ వరకు ఒక దఫా, ఈనెల 24 నుంచి డిసెంబరు 9వరకు కూడా మరో దఫా ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. వీరందరి పేర్లు వచ్చేనెల 30న తుది జాబితాలో ప్రచురిస్తారు. ఈ నేపథ్యంలో వచ్చేనెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉంది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఓటు హక్కుకు 2,21,556 మంది నమోదు చేసుకున్నట్టు సమాచారం. అల్లూరి సీతారామరాజు జిల్లా 3,082, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 46,207, తూర్పు గోదావరి జిల్లా 42,210, ఏలూరు జిల్లా 35500, కాకినాడ జిల్లా 41754, పశ్చిమ గోదావరి జిల్లా 52893 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఓటు నమోదు అధికారి పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అప్పటివరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మళ్లీ మరో దఫా వచ్చేనెల 9 వరకు దరఖాస్తుల స్వీకరించారు. అనంతరం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు డిసెంబరు 30న ప్రచురించే తుది జాబితాలో ఉంటాయి. ఓటు నమోదుకు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ అవసరం లేదు. సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే ఓటు నమోదు చేస్తారు. దరఖాస్తులను ఏఈఆర్వోలుగా ఉన్న తహసీల్దార్లు ధ్రువీకరిస్తే సరిపోతుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి శుక్రవారం సాయంత్రం వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని ఓటు నమోదు అధికారి, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఉంటే నమోదు చేసుకోవచ్చన్నారు.

బాలిక అదృశ్యం కేసుపై డీఎస్పీ విచారణ

ప్రత్తిపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతూ అదృశ్యమైన బాలిక నెల్లి వరలక్ష్మి ఆచూకీ తెలుసుకునేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బాలిక స్వగ్రామం గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి గురువారం సాయంత్రం ఆయన వెళ్లి తల్లిదండ్రులు నూకరత్నం, రామకృష్ణలతో మాట్లాడారు. బాలిక అదృశ్యం కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. వీలైనంత త్వరలోనే బాలిక ఆచూకీ తెలుసుకుని అప్పగిస్తామని డీఎస్పీ భరోసా ఇచ్చారు. ఆయన వెంట సీఐ సూర్య అప్పారావు, ఎస్‌ఐ లక్ష్మీకాంతం ఉన్నారు.


బాలిక తల్లిదండ్రులను విచారిస్తున్న డీఎస్పీ

ప్రేమ పేరుతో మోసం యువకుడిపై పోక్సో కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు చెందిన 16 ఏళ్ల బాలిక 8వ తరగతి వరకు చదువుకుంది. వేసవి సెలవులకు కడియపులంకలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అపై ఆమె గర్భం దాల్చింది. ఆ విషయం యువకుడికి తెలియజేయడంతో గర్భస్రావం కోసం మాత్రలు తెచ్చి ఇవ్వడగా ఈ నెల రెండో తేదీన గర్భస్రావమైంది. విషయం తెలుసుకున్న పెద్దలు బాలికను పెళ్లి చేసుకోమని కోరగా నిరాకరించడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు
వడిశలేరు వాసి అరెస్టు

గోపాలపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దేవరపల్లి సీఐ నాగేశ్వరరావు నాయక్, ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన వీరబత్తుల చంద్రశేఖర్ ఎన్నికల ముందు, ఆ తర్వాత చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్య పదజాలంతో పార్టీల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. దీంతో అతడిపై గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని అరెస్టు చేశారు.

జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా విశాఖ-విజయవాడ-విశాఖ మధ్య ఇటీవల ప్రవేశ పెట్టిన జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు రద్దు చేస్తూ రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు గురువారం రాత్రి అందాయి. 08567 విశాఖ-విజయవాడ మధ్య, 08568 విజయవాడ-విశాఖ మధ్య నడిచే జన సాధారణ్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 8, 10, 11, 13 తేదీల్లో రద్దు చేశారు. విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఇంటర్‌లాకింగ్, సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీకరణ పనులు చేపడు తున్న దృష్ట్యా ఈ రైళ్లను రద్దు చేసినట్టు విశాఖ రైల్వే పీఆర్వో అధికారి తెలిపారు.


క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న కాకినాడ జిల్లా డీఈవో రమేష్

ఉత్సాహంగా జిమ్నాస్టిక్స్ పోటీలు


క్రీడాకారుల విన్యాసాలు



కాకినాడ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని కాకినాడ జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ అన్నారు. కాకినాడలోని జిల్లా క్రీడా మండలి మైదానంలో అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలను గురువారం ఆయన జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. 68వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లా జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వందలాది మంది క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, వ్యాయామ విద్యా రాష్ట్ర పర్యవేక్షణాధికారి భానుమూర్తి రాజు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, ఏడీ నాగేశ్వరరావు, తలాటం హరీష్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి నూకరాజు, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ షర్మిల పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

రూ2 లక్షల మేర ఆస్తి నష్టం


పూర్తిగా కాలిపోయిన తాటాకిల్లు

ఎటపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీ గొందిరాజుపేట (కారం వారిగుంపు)లో కారం రవి ఇంటికి గురువారం సాయంత్రం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుంది. ఆ సమయంలో రవి ఆరేళ్ల కుమార్తె అన్విత ఇంట్లో ఉంది. ఇంటిని మంటలు చుట్టుముడుతుండగా చిన్నారి గమనించి పరుగున బయటకు వచ్చి ఇరుగు పొరుగు వారికి చెప్పింది. కొద్దిసేపటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. మంటల ధాటికి గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. రూ.21వేల నగదుతో పాటు బంగారు ఉంగరం, చెవికమ్మలు, బీరువా, టీవీ, గృహోపకరణాలు, సర్టిఫికెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితుడు చెప్పాడు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నష్టాన్ని అంచనా వేశారు.


సామర్లకోటలో ఎంప్లాయిస్ సంఘ్ నేతల ప్రచారం

రైల్వేలో గుర్తింపు సంఘం
ఎన్నికల సందడి

డిసెంబరు 4,5,6 తేదీల్లో పోలింగ్
పోటాపోటీగా హామీలిస్తున్న ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల సందడి నెలకొంది. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరిగే పోలింగ్‌లో కడియం నుంచి తుని (హంసవరం) వరకు విస్తరించి ఉన్న సామర్లకోట రైల్వే సెక్షన్‌లో సుమారు 800 మంది సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే సామర్లకోట నుంచి కడియం వరకు సంఘ్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించగా గురువారం సామర్లకోట నుంచి హంసవరం వరకు ప్రచారం పూర్తి చేశారు. సామర్లకోట జంక్షన్ ప్రధాన కేంద్రంగా రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌లు కొన్ని రోజులుగా పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. చివరిసారిగా 2013లో ఎన్నికలు జరిగాయి. దశాబ్దం తర్వాత మరలా జరుగుతుండడంతో హామీలను గుప్పిస్తూ ఇరు సంఘాలు పోటాపోటీగా ఉన్నాయి.

గుర్తింపు సంఘ ఎన్నికల్లో తొలి నుంచీ సత్తా చాటుతూ వచ్చిన మజ్దూర్ యూనియన్‌పై 2013లో మాత్రం ఎంప్లాయిస్ సంఘ్ గెలిచి సంచలనం సృష్టించింది. తమ పట్టుని మరోసారి నిలుపుకోవాలని ఎంప్లాయిస్ సంఘ్, పూర్వవైభవం సొంతం చేసుకోవాలని మజ్దూర్ యూనియన్ పరస్పరం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఆయా సంఘాల జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానించి మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులను వ్యక్తిగతంగా కలుసుకుంటూ మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు.

ఏకీకృత పెన్షన్ విధానం అమలుకు ఒత్తిడి తెస్తాం

ఎం.రమేష్, ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి, సామర్లకోట

రైల్వేలో నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) అమలుకు పోరాటం చేస్తాం. 8వ పే కమిషన్‌ను త్వరగా ఏర్పాటు చేయించి డాక్టర్ అక్రయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనం నెలకు రూ.32,500 ఇప్పించాలి. 2020 జనవరి నుంచి 2021 వరకు నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, డీఆర్ తక్షణం విడుదల చేయించేందుకు పోరాటం కొనసాగిస్తాం. పీఎల్ బోనస్‌పై ఉన్న శాలరీ సీలింగ్‌ను తొలగించాలి. 12 గంటల డ్యూటీని రద్దు చేసి 8 గంటల విధానాన్ని ప్రవేశపెట్టిస్తాం. రైల్వేలో పాయింట్స్‌మెన్ కేటగిరీ-4 గ్రేడ్ పే స్ట్రక్చర్ అమలుకు రైల్వే బోర్డుతో చర్చిస్తాం. రైల్వే ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య చికిత్స ట్రావెలింగ్ పాస్ సదుపాయాల కల్పనకు ప్రయత్నం చేస్తాం. ట్రాక్ మెయింటెనర్ల పనిగంటలు తగ్గించి భోజన విరామాన్ని డ్యూటీలో భాగంగా పరిగణించాలి. ఎన్‌ఎఫ్‌ఐఆర్ డిమాండ్ నెంబరు 1, 2022 ప్రకారం ఎల్‌డీసీఈని అందరికీ వర్తింపచేయాలి. కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న మహిళా ఉద్యోగులు వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే నిబంధనతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలి.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పాఠశాలలో ఆర్‌జేడీ పరిశీలన

తాళ్లరేవు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్‌జేడీ జి.నాగమణి ఆదేశించారు. హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో గురువారం మౌలిక సదుపాయాలు, సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్-2, మధ్యాహ్న భోజనాలను ఆర్‌జేడీ నాగమణి పరిశీలించారు. విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ..

104 ఉద్యోగుల ఆందోళన



కరప తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

కరప, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు 104 ఉద్యోగులు గురువారం కరప తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ 3నెలలుగా 104 ఉద్యోగులకు వేతనాలు ఇవ్వక వారి కుటుంబపోషణ కష్టతరంగా మారిందన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా 104 సేవలను అందించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 104 ఉద్యోగులు గురువారం పిఠాపురం తహసీల్దారు కార్యాలయంవద్ద ఆందోళన నిర్వహించారు. అరబిందో అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్ములు తిరిగి చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. 74మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, డీఎస్సీ ద్వారా నియమితులైన వారిని కాంట్రాక్టు జాబితాలో పెట్టాలని కోరారు. ఉద్యోగులకు బీమా సౌకర్యం కల్పించాలని, అరబిందో ద్వారా రావాల్సిన ఇతరబకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దారు రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు, ఉద్యోగులు దుర్గాదేవి, రాఘవ, సంతోష్ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..



గొల్లప్రోలు ఎంపీడీవో స్వప్నకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

గొల్లప్రోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 104 అంబులెన్సులు, సేవలను పీహెచ్‌సీల పర్యవేక్షణలో నిర్వహించాలని, వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయం వద్ద 104 ఉద్యోగులు గురువారం ఆందోళన నిర్వహించారు. 3నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్నకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో 104 ఉద్యోగులు కె.సూర్యదుర్గ, ఎం.సువర్ణరాజు పాల్గొన్నారు.

ఇష్టమైన భాషలో మాట్లాడేందుకు ప్రయత్నించాలి

● జేఎన్టీయూకే వీసీ మురళీకృష్ణ

కాకినాడరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తమకిష్టమైన భాషలో మాట్లాడేందుకు ప్రయత్నించాలని, అందరితోనూ సత్సంబంధాలు ఏర్పర్చుకున్నప్పుడు కమ్యూనికేషన్‌స్కిల్స్ పెంపొందుతాయని జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల్లో గురువారం నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో వీసీ మురళీకృష్ణ పాల్గొనగా కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి పి.కిరణ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు సరైన అలవాట్లను సక్రమమైన విధానంలో అనుకరించినపుడే వారిలో నిబద్ధత, పరిపక్వత ఏర్పడతాయన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ అధ్యక్షత వహించగా డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో వర్మ, శ్రీహరి వర్మ, పీఆర్వో సాయిబాబు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు పెద్దాపురప్పాడు విద్యార్థుల ఎంపిక



బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కరప, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగే అంతర జిల్లాల బేస్‌బాల్ పోటీలకు కరప మండలం పెద్దాపురప్పాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడ స్కూల్ గేమ్స్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బేస్‌బాల్ అండర్-14, అండర్-17 విభాగాలకు ఈనెల 2న కాకినాడ డీఎస్సీ గ్రౌండ్‌లో ఎంపికలు జరిగాయి. అండర్-17 విభాగానికి పాఠశాలకు చెందిన టి.పవన్ శివకేశవ, వై.సుధీర్, డి.సూర్యవెంకటమణికంఠ, జి.వీరమణికుమార్, బాలికల విభాగానికి కె.సంధ్యారాణి ఎంపికయ్యారు. ఈనెల 9నుంచి 11 వరకు గుంటూరులో ఈ పోటీలుజరుగుతాయి. అండర్-14కు పాఠశాలనుంచి ఎస్.నాగేంద్ర, బి.అంజనీకుమార్, బాలికల తరపున సీహెచ్ విజయలక్ష్మి, కె.అనురాధ, కె.కరుణశ్రీ ఎంపికయ్యారు. ఈనెల 9 నుంచి 11 వరకు తిరుపతిలో ఈ పోటీలు జరుగుతాయని హెచ్ఎం ఎస్ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్‌లు తెలిపారు. అంతర జిల్లాల బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, పీడీలతోపాటు సర్పంచ్ బిరుదా సరస్వతి, ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాసఅప్పారావు, విద్యాకమిటీ చైర్మన్ యాళ్ల నాగమణి, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు తెలగాని వెంకట్రావు అభినందించారు.

భూముల రీసర్వేలో అన్నీ తప్పులే

» సరిచేయాలంటూ గొల్లప్రోలులో 400 దరఖాస్తులు



దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

గొల్లప్రోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల సమగ్ర రీసర్వే తప్పులతడకగా మారింది. రైతులకు సమాచారం ఇవ్వకుండా, సర్వే సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయికి రాకుండా భూముల సర్వే చేపట్టడంతో పలు తప్పులు దొర్లాయి. రైతులకు ఉన్న భూముల విస్తీర్ణాలు తగ్గిపోవడం, ముగ్గురు నుంచి 20మంది రైతులకు కలిపి ఒకే ఎల్‌పీ నెంబరు ఇవ్వడం, కొందరి రైతుల భూముల రీసర్వేలో చూపించకపోవడం, వ్యవసాయభూములను నివాసస్థలాలుగా చూపడం వంటి తప్పిదాలు జరిగాయి. వీటిపై రెండేళ్లుగా రైతులు పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటి వరకూ పరిష్కారం కాలేదు. రీసర్వే తప్పిదాలతో ఇటీవల వచ్చిన ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా సగానికి పైగా రైతులకు పంటనష్టపరిహారం అందకుండా పోయింది. ఉమ్మడి ఎల్‌పీల్లో ఉన్నవారికి పరిహారం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గొల్లప్రోలు పట్టణంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించి రీసర్వేలో తప్పిదాలపై దరఖాస్తులు స్వీకరించారు. రీసర్వేలో తమకు జరిగిన అన్యాయాన్ని, విస్తీర్ణం వివరాలు తప్పుగా నమోదు కావడం, ఉమ్మడి ఎల్‌పీలు ఇవ్వడం తదితర అంశాలపై 400 దరఖాస్తులు అందాయి. గ్రామసభ నిర్వహించిన ప్రాంతమంతా దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన రైతులతో కిక్కిరిసిపోయింది.గ్రామసభలో తహసీల్దారు సత్యనారాయణ, రీసర్వే డీటీ మస్తానీ పాల్గొన్నారు.

19న మహారుద్రాభిషేక పూర్వక కార్తీక సమారాధన

కాకినాడ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న మంగళవారం పాత గైగోలుపాడులోని శ్రీషిరిడీ సాయిబాబా ధ్యాన మందిర ప్రాంగణంలో మహా రుద్రాభిషేక పూర్వక కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణమూర్తి, శ్రీషిరిడి సాయిబాబా ధ్యానమందిర వ్యవస్థాపకుడు అల్లూరి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం సంఘ కార్యాలయంలో రుద్రాభిషేక వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడు తూ ధ్యాన మందిరం, సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఆ రోజు ఉదయం పరమేశ్వరుడికి మహారుద్రాభిషేకం, రుద్ర హోమం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, బృందావన పూజలు వేద పండితులచే జరిపిస్తున్నామన్నారు. ఈ విశేష కార్యక్రమం విజయవంతానికి అందరూ భాగస్వాములు కావాలన్నారు. బ్రాహ్మణులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం కార్యదర్శి ప్రొద్దుటూరి బాలాజీ విశ్వనాథ శర్మ, కోశాధికారి కప్పగంతుల సాయిరాంశర్మ, గౌరవ అధ్యక్షుడు నాగదేవర లక్ష్మీనారాయణశర్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడు యాతగిరి పరశురామ్, యాతగిరి రఘోత్తమ పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ సమీపంలో నూతనంగా నిర్మించినప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాల్లో వినియోగానికిగానూ దాత కుర్చీలు బహూకరించారు. డిగ్రీ కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు బాదం ఉదయ సూర్యప్రకాష్ 20కుర్చీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణికి గురువారం అందజేశారు. ఈ నూతన భవనాలను ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు కొండేపూడి శంకరరావు, మునిసిపల్ కౌన్సిల్ టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శిశు సంరక్షణపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా డెయిరీఫారమ్ ఏరియా ఐసీడీఎస్ అర్బన్ సెంటర్‌లో బుధవారం బాలింతలకు శిశుసంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల లీగల్ కౌన్సిల్ డాక్టర్ వై.వసంత మాట్లాడుతూ శిశుసంరక్షణపై బాలింతలకు అవగాహనకల్పించారు. యుపీహెచ్‌సీ ఎంవో అవినాష్ పిల్లల సంరక్షణ, టీకాల ప్రాధాన్యాన్ని వివరించారు. సీడీపీవో ఎ.జ్యోతి మాట్లాడుతూ శిశు సంరక్షణ పద్ధతులను తెలియజేశారు.

శిశు సంరక్షణకు వ్యాక్సినేషన్ ప్రధానం

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శిశు సంరక్షణలో వ్యాక్సినేషన్ కీలకమని పిఠాపురం ప్రభుత్వాస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ పి.సుజాత తెలిపారు. పట్టణంలోని సీహెచ్‌సీలో మండలలీగల్ సర్వీసెస్ అథారటీ ఆధ్వర్యంలో 12వ అదనపు జిల్లా జడ్జి ఏ. వాసంతి ఆదేశాల మేరకు గురువారం శిశు సంరక్షణా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. వైద్యాధికారులు ఎస్.షబానా,ఎస్.ఫణితేజ, ప్యానల్ అడ్వకేట్లు కొంగు నూకరాజు, ఏగీత పాల్గొన్నారు.

రేపు పీవీ రావు మాలమహానాడు జిల్లా సమావేశం

కార్పొరేషన్(కాకినాడ),నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడలోని హోటల్ ఆర్‌ఎల్ గ్రాండ్‌లో పీవీ రావు మాలమహానాడు జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ తెలిపారు. కాకినాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశానికి మాలమహానాడు కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఘంటసాల జీవిత చరిత్ర పుస్తకాల బహూకరణ

తాళ్లరేవు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శతాబ్ది గాయకుడు ఘంటసాల జీవిత చరిత్ర పుస్తకాలు, ఫొటోలను ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పల్లెసరి డైరెక్టర్ మురళీధర్ గురువారం బహూకరించారు. తాళ్లరేవు, లక్ష్మీపతిపురం, గాడిమొగ, భైరవపాలెం ప్రధానోపాధ్యాయులకు అందించారు. మురళీధర్ మాట్లాడుతూ బొందిలి శ్రీనివాస్ నరసింగ్, బూస్టర్ కల్చరల్ ఆర్గనైజేషన్ యూకేవారి సౌజన్యంతో చల్లా సుబ్బారాయుడు సంకలనం ద్వారా పుస్తకాలు ప్రచురించారన్నారు.

గ్యాస్‌పైపులైన్ ఏర్పాటుపై చర్చలు విఫలం

తాళ్లరేవు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో గ్యాస్‌పైపులైను నిర్మాణం చేస్తున్న ప్రతినిధులు, గ్యాస్‌ట్యాపింగ్ పాయింట్ ప్రతినిధులు, గ్రామస్తులతో డిమాండ్లపై ఆర్డీవో మల్లిబాబు గురువారం చర్చించారు. గ్రామస్తులు పంచాయతీ అభివృద్ధికి కోరిన ఐదు డిమాండ్లలో ఏఒక్కటికీ సమాధానం చెప్పకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. సమావేశంలో తహసీల్దార్ పి.త్రినాథరావు, కోరింగ ఎస్ఐ సత్యనారాయణ, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు పాల్గొన్నారు.

'సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి'

పెద్దాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 15,16,17 తేదీల్లో పట్టణంలో నిర్వహించనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా పట్టణంలో గోడరాతల ద్వారా ప్రచారం చేపట్టామన్నారు. సీఐటీయూ నాయకులు గూనూరి రమణ, పలివెల వీరబాబు గోడలపై రాతలు రాసే కార్యక్రమం నిర్వహించారు.

నేడు వైద్యశాఖామంత్రి పెద్దాపురం రాక

పెద్దాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న పెద్దాపురం పట్టణంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పర్యటించనున్నట్లు పెద్దాపురం నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ డాక్టర్ గోరకపూడి చిన్నయ్యదొర తెలిపారు.రామారావుపేటలో బీజేపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని, సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరని కాకినాడ ట్రాఫిక్ సీఐ రమేష్ అన్నారు. ట్రాఫిక్-1, 2 పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు ఆధ్వర్యంలో విజయ గాయత్రి జూనియర్ కాలేజీలో విద్యార్థులకు రోడ్డు యాక్సిడెంట్, ట్రాఫిక్ రూల్స్ సైబర్ నేరాలపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. వాహన ప్రమాదాలతోపాటు ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్‌యాప్స్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ వంటి వాటిపై అవగాహన కల్పించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలుశిక్ష

కాకినాడ క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుతున్న ఐదుగురికి తలో రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్-1, 2 పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనదారులకు పరీక్షలు చేయగా 11మంది మద్యం తాగినట్లు పోలీసులు కేసులు నమోదు చేసి మూడో స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు ఎదుట హాజరుపరిచారు. ఇందులో ఐదుగురికి తలో రెండు రోజుల జైలు శిక్ష, మిగతా ఆరుగురికి తలో రూ.10వేల వంతున రూ.60వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పాడా ఏర్పాటుతో అభివృద్ధిలో నూతన శకం



డాక్టర్ పిల్లా శ్రీధర్

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాడా ఏర్పాటుతో పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి, చరిత్రలో నూతనశకం ప్రారంభమైందని జనసేన పిఠాపురం నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పిల్లా శ్రీధర్ తెలిపారు. పిఠాపురంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. పిఠాపురం శాసనసభ్యుడిగా ఎన్నికైన నాటి నుంచి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఏళ్ల తరబడి నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని, అభివృద్ధికి నిధులు తీసుకువచ్చారని తెలిపారు. పవన్ నేతృత్వంలో పిఠాపురం దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. పాడా ఏర్పాటుతోపాటు పిఠాపురం ప్రభుత్వాస్పత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినందుకు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న పవన్‌కు ప్రజలు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

రుణ కల్పనకు బ్యాంకర్లు సహకరించాలి: మున్సిపల్ కమిషనర్

సామర్లకోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో ఉన్న అన్ని బ్యాంక్‌ల మేనేజర్లు రుణకల్పనకు సహకరించాలని, టిడ్కో గృహాల లబ్ధిదారులకు అప్పగింతలో తదుపరి ప్రక్రియలు నిర్వహించడంలో వేగవంతం చేయాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కోరారు. తన ఛాంబర్‌లో ఆమె గురువారం బ్యాంక్‌ల మేనేజర్లు, మెప్మా సిబ్బంది, సీఆర్‌పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మెప్మా ఇన్‌చార్జి సీఎంఎం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ డ్వాక్రా రుణాల కల్పలో భాగంగా శ్రీనిధి, ఎస్‌హెచ్‌జీ, టిడ్కో తదితర పథకాలకు సంబంధించి రుణాల మంజూరులో బ్యాంకర్లు చురుగ్గా వ్యవహరించాలన్నారు. ఇప్పటివరకూ డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రుణాలకు సంబంధించి బ్యాంకర్లతో సమీక్షించారు. సమావేశంలో ఎస్‌బీఐ మేనేజర్ సీతారామయ్య, శ్రీనివాస్, తదితర బ్యాంకుల మేనేజర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



సంతోష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మణిపూర్ లో డిసెంబరులో జరిగే జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు రూరల్ మండలం తూరంగి జడ్పీఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి సీహెచ్ సంతోష్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం బొజ్జా శరత్‌కుమార్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సంతోష్‌కుమార్ 89కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. ఈ క్రీడాకారుడు డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సతీషకుమార్‌వద్ద శిక్షణ పొందుతున్నారు. సంతోష్‌కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీ మాచరరావు, ఉపాధ్యాయులు సత్కరించారు.

నేరాల అదుపునకు వ్యాపారులు సహకరించాలి: డీఎస్పీ

సామర్లకోట,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సామర్లకోట జంక్షన్‌స్టేషన్ సెంటర్ నిత్యం జనసమర్థంతో రద్దీ వాతావరణాన్ని సంతరించుకుని ఉన్నందున ప్రతి వ్యాపారీ తమ దుకాణాల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. గురువారం సామర్లకోటసెంటర్‌లో పలు వ్యాపారస్తులతో కలిసి సమీక్షించారు. స్టేషన్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ ఇవి మూడూ సామర్లకోట పట్టణ కేంద్రంగా వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. ఆయా వ్యాపారల వద్ద ఏఏ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే అంశంపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఆయా వ్యాపారస్తుల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అదుపు చేయవచ్చన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో నిత్య జనసమూహం ఉంటున్నందున సీసీ కెమెరాలు తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీకృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ పిఠాపురం పట్టణంలో వైద్యులు, సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రభుత్వం చేపట్టనున్న కేన్సర్ యూనివర్సల్ స్క్రీనింగ్‌పై వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. 18ఏళ్లు, అంతకంటే అధిక వయస్సు కలిగిన వారందరికీ సాధారణ ఎన్‌సీడీలు, మధుమేహం, రక్తపోటు, సాధారణ కేన్సర్ నివారణ, నియంత్రణ, స్క్రీనింగ్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా చేపట్టనున్నారని వివరించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జయరామ్ పాల్గొన్నారు.

గాడిమొగలో వైద్యులు కేన్సర్‌పై ర్యాలీ



తాళ్లరేవులో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాళ్లరేవు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేన్సర్ నివారణపై వైద్యాధికారి డాక్టర్ శ్యామల ఆధ్వర్యంలో గాడిమొగలో వైద్యులు గురువారం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో కుమారి, ఎంపీహెచ్ఈవో బొడ్డు కుమార్, పీహెచ్ఎన్ విజయకుమారి, హెచ్‌వీ లక్ష్మి, హెచ్‌వీ రంజన్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కందిపప్పు అందజేయాలని జేసీకి వినతి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ 41వ డివిజన్ పరిధిలో ఉన్న 109, 110 రేషన్‌దుకాణాల్లో ఉన్న రేషన్‌కార్డుదారులకు ఈనెలకు సంబంధించి పంచదార, కందిపప్పు పంపిణీ అందరికీ జరిగేలా చూడాలని 41వ డివిజన్ బీజేపీ నాయకులు గోడి వెంకట్, రేషన్ కార్డుదారులు జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. రేషన్‌డీలర్లు పూర్తిస్థాయిలో డీడీలు తీయకపోవడంవల్ల ప్రజలకు కందిపప్పు, పంచదార పంపిణీలో ఇబ్బందులు ఉన్నాయన్నారు. వెంటనే జేసీ రాహుల్‌మీనా స్పందించి జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్‌కు ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే 109, 110 దుకాణాల్లో కందిపప్పు, పంచదార పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. బీజేపీ నాయకులు దంగేటి రామకృష్ణ, కళ్యాణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌టాక్‌లో విద్యార్థుల ప్రతిభ



క్విజ్‌లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సర్పవరంజంక్షన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో నిర్వహించిన ఇన్‌టాక్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో నాగమల్లితోట ఆశ్రమ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పదో తరగతికి చెందిన జి.కుమారి, సంహిత, కె.భార్గవ షణ్ముఖ శ్రీనివాస్ క్విజ్‌లో విశేష ప్రతి కనబర్చి ప్రథమస్థానంలో నిలిచారని స్కూల్ చైర్మన్ డి.అభిషేక్ తెలిపారు. గురువారం ఆశ్రమ స్కూల్‌లో నిర్వహించిన అభినందన సభలో రాష్ట్రస్థాయి క్విజ్‌లో ప్రతిభచూపిన విద్యార్థులను సత్కరించారు. డైరెక్టర్ డి.అష్మిత, డీన్ ఎన్.ఉమామహేశ్వరరావు, అడ్మిన్ హెడ్ పి.సావిత్రి, ప్రిన్సిపాల్ టి.అగస్టిన్‌లు పాల్గొన్నారు

సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి దేవాదాయశాఖ రూ.2.99లక్షలు మంజూరు చేసింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో మంజూరైన ఈ నిధుల చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు గురువారం పవన్ నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు.

భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతి

సామర్లకోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడతాయని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య అన్నారు. భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని సామర్లకోట వివేకానంద విద్యాసంస్థ ఆవరణలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఏఎస్ సరోజిని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

'శ్రీప్రకాష్'లో...

పెద్దాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో సర్ సీవీ రామన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సీవీ రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కల్చరల్ కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ఘనంగా చట్ పూజా కార్యక్రమం

సర్పవరం జంక్షన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ బోట్‌క్లబ్ పార్కులో మార్వాడి సంఘం ఆధ్వర్యంలో గురువారం చట్ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మార్వాడీలు బోట్‌క్లబ్ పార్కు.వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో సూర్యభగవానుడికి పూజలు నిర్వహించారు. బెల్లం, చెరకు, కొబ్బరికాయలు, అరటి పండ్లు, సూర్యునికి నివేదించారు. ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ హాజరయ్యారు.

మహిళ అదృశ్యంపై కేసు

తునిరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసారావు తెలిపినవివరాలప్రకారం.. తునిమండలం ఎస్.సూర వరానికి చెందిన వేములపూడి గాయత్రి 17 నెలల కుమారుడు గౌతమ్‌ను తీసుకుని విజయవాడకి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లి ఇద్దరు కనిపించకుండా పోయారంటూ భర్త వెంకట్రాజు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


సీడీపీవో దేవమణికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ వర్కర్లు

బిల్లుల బకాయిలు ఐదున్నర లక్షల చెల్లించాలంటూ

అంగన్వాడీ వర్కర్ల ధర్నా

రాజవొమ్మంగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు కూరగాయలు, కట్టెలు, బాలామృతం తెచ్చేందుకు గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు అంగన్వాడీ వర్కర్లు సుమారు ఐదున్నర లక్షలు ఖర్చు చేశారు. సంబంధిత బిల్లులను వెంటనే అధికారులకు అందజేశారు. అయితే ఇప్పటికీ వారి ఖాతాల్లో డబ్బు జమ కాలేదు. అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నా స్పందించట్లేదంటూ వర్కర్లు గురువారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఐసీడీఎస్ కార్యాలయ యూడీసీ సత్యకుమారి కార్యలయం ఎదుటే నేలపై కూర్చుని తనకూ న్యాయం చేయాలని నినదించారు.

దీనిపై ఐసీడీఎస్ అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా యూడీసీ స్పందించారు. మే 30న విడుదలైన బడ్జెట్‌లో బిల్లు చేసేందుకు అంగన్వాడీల ఖర్చుల నిమిత్తం రెండు స్పెల్స్‌లో రూ.5,42,553కు బిల్లులు పెట్టారన్నారు. బిల్లులు ప్రోసెస్ చేసేందుకు సీడీపీవో దేవమణి ఓటీపీ చెప్పకపోవడంతో జూలైలో బడ్జెట్ లాప్స్ అయిందన్నారు. అయితే తనవైపు తప్పు లేదని సీడీపీవో చెప్పారు. వెంటనే చర్యలు చేపట్టి రూ.5.5 లక్షల బిల్లులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని సీడీపీవో దేవమణికి అంగన్వాడీలు వినతిపత్రం అందించారు. ప్రస్తుత మార్కెట్ రేట్లతో కేంద్రాల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు పి.రామరాజు, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు చిన్ని కుమారి, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసీ చిన్నారులతో ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

'ఆదివాసీల అభివృద్ధే లక్ష్యం'

చింతూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ఐటీడీఏ చొరవ చూపుతుందని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. గురువారం సూరకుంటలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జాతీయ ఆదివాసీ గౌరవ దినోత్సవం నిర్వహించారు. ఆదివాసీ నాయకులు, పెద్దలు నిర్వహించిన కార్యక్రమానికి భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఆదివాసీలు గౌరవ దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమ న్నారు. ఆదివాసీలు సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఆయా సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పీవో చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడివి నెహ్రూ, తోడెం దేశయ్య, పాయం చంద్రయ్య, తిమ్మసాయి, మడివి ముద్దరాజు, చిచ్చడి మురళి, సవలం అమల, సోడె శ్రీను, చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.


గుర్తేడు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ఐటీడీఏ పీవో సింహాచలం

'విద్య, ఆరోగ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి'

వై.రామవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని ఎగువ ప్రాంతాలైన గుర్తేడు, దారగడ్డ, మారేడుమిల్లి మండలం ఆకుమామిడికోట గ్రామాల్లో పర్యటించారు. గుర్తేడు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలని, ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రతిరోజూ తాజా ఆహార పదార్థాలను అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బంది సంఖ్యపై ఆరా తీశారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు త్వరితగతిన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామంలోని సచివాలయాలను పరిశీలించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పీవో వెంట గుర్తేడు సర్పంచ్ గొర్లె దృశ్యంతుడు వున్నారు.



'అమరుల త్యాగాలు మరువలేనివి'

ఎటపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యునిస్టు ఉద్యమంలో నిస్వార్థంగా పోరాడుతూ అమరులైన వారి త్యాగాలు మరువలేనివని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కె.రంగారెడ్డి అన్నారు. ఎర్రగుంటపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన సోడే ముకేశ్, మడకం శ్రీను సంతాప సభలో ఆయన మాట్లాడారు. అమరవీరుల స్థూపం వద్ద ఎర్ర జెండా ఎగురువేశారు. ఆదివాసీలు, పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే అన్ని వర్గాల ప్రజలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. పత్తి, ధాన్యం పంటల కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆదివాసీ గ్రామాల్లో విద్య, వైద్య, రహదారుల అభివృద్ధికి ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ నాయకులు దాసరి సాయన్న, మునిగల శివ, జోగారావు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

మోతుగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి నఫియాసుల్తానా మాట్లాడుతూ వైద్య పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సకాలంలో వైద్యం అందించవచ్చని తెలిపారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఆశా వర్కర్లు, జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత తహసీల్దారు

ధరణేశ్వరరావు మృతికి సంతాపం

రంపచోడవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విశ్రాంత తహసీల్దారు గోడి ధరణేశ్వరరావు మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క బాలశివరామకృష్ణ, చిలకల సత్యనారాయణ, చుక్కా సంతోష్‌కుమార్, దంగేటి సత్తిబాబు, నల్లమిల్లి సుందర్‌బాబు, బచ్చెల ఆదినారాయణ, రాయుడు బాబు సంతాపం తెలిపారు. రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన ధరణేశ్వరరావు ఉన్నతాధికారుల నుంచి మన్ననలు పొందారని గుర్తు చేసుకున్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ..


తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

104 ఉద్యోగుల వినతి

ప్రత్తిపాడు,నవంబరు7(ఆంధ్రజ్యోతి): మూడునెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ కష్టమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం జీతాలు ఇచ్చి తమను ఆదుకోవాలంటూ 104 సిబ్బంది ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసి తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేసి 104 ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు ఏకరువు పెట్టారు. పీహెచ్‌సీల ద్వారా 104 సేవలను 50వేల రూపాయల ఖర్చుతో నిర్వహించే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆందోళనకారులు తెలిపారు. జీవో 7 ద్వారా 104 సిబ్బందికి వేతనాలు అందించాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని 74మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల డీఈవో బి.ఇజ్రాయిల్‌రాజు, బి.మణికంఠ, డ్రైవర్లు అప్పారావు, మణికంఠ, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుసాధికారిక సంస్థ రైతు కిట్‌ల గోల్‌మాల్‌పై విచారణ

రౌతులపూడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మరేగులలో రైతు సాధికారిక సంస్థలో జరిగిన రైతు కిట్ గోల్‌మాల్‌పై రౌతులపూడి రైతు సాధికారిక సంస్థ అధికారులు అరుణ, భానుమతి రైతు సేవా కేంద్రంలో విచారణ చేపట్టారు. గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితో పాటు సంస్థ ఎంటీ దాడి వరలక్ష్మి అవకతవకలపై ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేశారు. రైతులకు ఇవ్వాల్సిన కిట్‌లను స్వాహా చేసినట్లు సర్పంచ్ ఆరోపించారు. విచారణ జరిపిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారం

కోటనందూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూసదస్సుల ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని తహశీల్దార్ సుబాష్ అన్నారు. గురువారం అర్తమూరు రెవెన్యూలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

'న్యాయవాదులు సేవా దృక్పథంతో పని చేయాలి'

ప్రత్తి పాడు,నవంబరు7(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సేవా దృక్పథంతో పని చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. ప్రత్తిపాడు బార్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాజాల చిట్టిబాబు, బార్ కార్యవర్గ సభ్యులు గురువారం తోటవీధిలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ న్యాయవాదులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. సీనియర్ న్యాయవాదులు బుగతా శివ, ఆడారి సుగుణ, బొంగుబూరు మధుబాబు, పిల్లి బలరాం పాల్గొన్నారు.

నైపుణ్యాల సామర్థ్య గణనకు నిర్ణయం

బీసీ కార్పొరేషన్ ఈడీ

ప్రత్తిపాడు,నవంబరు7(ఆంధ్రజ్యోతి): నైపుణ్యగణనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని దీంతో నైపుణ్య గణన చేపట్టడానికి మండలంలో సర్వే బృందాలు సందర్శించనున్నాయని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి ఈడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 15నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అందరి నైపుణ్యాలను గణన చేయనున్నట్లు తెలిపారు. యువత మాత్రమే కాకుండా చేతివృత్తులు, గృహిణులు వారి నైపుణ్యాలను నమోదు చేస్తామన్నారు. ఈవోపీఆర్డీ కాశీవిశ్వనాథ్,గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గండేపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకంపల్లి, ఎస్టీరాజపురం సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలుపుదల చేయడం జరుగుతుందని ఎలక్ట్రికల్ డీఈ వీరభద్రరావు అన్నారు. కె.గోపాలపురం, కె.నాయకంపల్లి సబ్ డివిజన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి వేడుకలు

గండేపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో భౌతిక శాస్త్రవేత్త నోబెల్ బహుమతి విజేత సీవీ రామన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ వారు నిర్వహించిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబరు 7న దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విజ్ఞాన శాస్త్ర రంగంలో అత్యంత ప్రముఖుల్లో ఒకరిని గౌరవిస్తూ డాక్టర్ జీవీ రామన్ జయంతి వేడుకలు జరుపుకుంటున్నారు. కళాశాల డీన్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సుబ్బారావు, వివిధ శాఖల విభాగాధిపతులు, ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తొండంగిలో..

తొండంగి, నవంబరు7(ఆంధ్రజ్యోతి):సర్‌సివి రామన్ జయంతి వేడుకల్ని గురువారం పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీవీ రామన్ కనుకొన్న రామన్ ఎఫెక్ట్ ద్వారా మానవాళికి ఎంతోప్రయోజనం చేకూరిందన్నారు. అతి సామాన్య కుటుంబంనుంచి వచ్చిన ఆయన ప్రపంచం మెచ్చే స్థాయికి ఎదిగారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరేందుకు ప్రయత్నించాలన్నారు.ప్రోగ్రాం కోఆర్డినేటర్ కెబిఎస్‌కుమార్, మహాలక్ష్మినాయుడు,వి.నారాయణరావు, శ్రీనుబాబు మాట్లాడారు.

సాగుభూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలి

ప్రత్తిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సాగుభూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వెంకటనగరం గిరిజనులు ప్రత్తిపాడులో లిబరేషన్ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. వెంకటనగరం గిరిజనులతోపాటు వ్యవసాయ కూలీలు ప్రత్తిపాడు చేరుకుని అల్లూరి సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ ఎం. సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. గిరిజనులు దశాబ్ధాల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు అధికారులు హక్కుపత్రాలు మంజూరు చేయకపోవడంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళనకారులు తెలిపారు. అధికారులు హక్కుపత్రాల మంజూరుకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో వెంకటనగరం వ్యవసాయ కూలీ సంఘ అధ్యక్షుడు బండి సూరిబాబు, వన్నెపల్లి వెంకటరమణ, ముప్పిడి నూకరాజు, రేసుకట్ల వీరబాబు,మట్టల అచ్చమ్మ, కట్ల దేవి, లిబరేషన్ నాయకులు మానుకొండ లచ్చబాబు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ శ్రీనివాస్

జగ్గంపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు సైబర్ నేరాలు, దొంగతనాలు, రోడ్డుప్రమాదాలపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ అన్నారు. జగ్గంపేట మండలం రామవరంలో గురువారం సచివాలయంలో గ్రామస్తులతో జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు సమావేశం నిర్వహించారు. సీఐ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సైబర్ నేరగాళ్లు గ్రామాల్లో ప్రజలకు సెల్‌ఫోన్ లింకులు పంపించి ఎకౌంట్లో నగదును దోచుకుంటున్నారని, ప్రతి ఒక్కరు వారి బారిన పడకుండా అపరిచిత వ్యక్తులు పంపించే ఆన్‌లైన్, వాట్సాప్ లింకులను క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ వస్తువులు, కొనుగోలు ఆన్‌లైన్ మోసాలపట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా నిషేధిత పదార్థాలైన గంజాయి, నాటు సారా, మత్తు పదార్థాలను తయారు చేసిన అమ్మిన, రవాణా చేసిన జగ్గంపేట సీఐ 94407 96529, జగ్గంపేట ఎస్ఐ 94407 96569 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

'ఇన్సూరెన్స్ స్కీమ్‌లను సద్వినియోగపర్చుకోండి'

కోటనందూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యాన పంటలకోసం ఇన్సూరెన్సు స్కీమ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జీడిమామిడి రైతులందరు సద్వినియోగపర్చుకోవాలని ఉద్యానశాఖ అధికారి విజయలక్ష్మీ అన్నారు.గురువారం కేఎస్‌కొత్తూరులో ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా జీడిమామిడి రైతులు ఒక ఎకరానికి రూ.1500 చెల్లిస్తే అకాల వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత వంటి విపత్తులు తలెత్తినప్పుడు పంటలకు ఒక ఎకరానికి రూ.30వేల పరిహారం ఇస్తామన్నారు. ఈ ప్రీమియంను దగ్గరలో ఉన్న సిఎస్‌సి సెంటర్‌లో చెల్లించుకోవచ్చునన్నారు. ఆఖరుతుది ఈ నెల 15కల్లా చెల్లించాలన్నారు. జీడిమామిడిపై వచ్చేతెగుళ్లు వివరించారు. విఎస్ఏ అగుడు శ్రీను,సిహెచ్‌అపర్ణ, రాంబాబు రైతులు పాల్గొన్నారు.

తిరుమలలో టీటీడీ పాలక మండలి సభ్యులు నెహ్రూ


మంత్రాలయం పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకుంటున్న నెహ్రూ

జగ్గంపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తిరమలలో పలువురిని మర్యాదపూర్వకంగా కలిసి సమావేశాలు నిర్వహిస్తున్నారు. టీడీపీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీడీపీ దేవస్థానం జేఈవో వెంకయ్యచౌదరి, కుప్పంకు చెందిన టీటీడీ పాలక మండలి సభ్యులు శాంతారామ్‌లను కలిశారు. తిరుమలలో మంత్రాలయ పీఠాధిపతులను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ శుక్రవారం పాలకమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు.

భారీగా తరలిన నాయకులు

గండేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రమాణ స్వీకారానికి శుభాకాంక్షలు తెలిపేందుకు మండలంలోని గ్రామాలనుంచి 25కార్లలో కూటమి నాయకులు, నెహ్రూ అభిమానులు గురువారం సాయంత్రం తిరుపతి తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు అడబాల భాస్కరరావు, పాలకుర్తి ఆదినారాయణ, కంటిపూడి సత్యనారాయణ సహా పలువురు వెళ్లారు.

సీఐటీయూ కార్యవర్గం ఎన్నిక

ఏలేశ్వరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐటీయూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్వారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు దువ్వా శేషు బాబ్జి నేతృత్వంలో కన్వీనర్‌గా రొంగల ఈశ్వరరావు, సభ్యులుగా పొనపల్లి రమణ, పిల్లా రాంబాబు, టి.శివదుర్గ, సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మల్లేపల్లిలో వన సమారాధన

గండేపల్లి,నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లిలో హైవే పక్కనఉన్న సాయిబాబా ఆలయంవద్ద గురువారం గ్రామ మాజీ ఉపసర్పంచ్ దార్లంక శ్రీనివాసరావు సత్యదంపతులు ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన అన్న సమారాధన నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన వి.వీరబాబు(31)మద్యంకు బానిసై, పెళ్లై నాలుగేళ్లయినా సతానం కలగలేదని మనస్తాపంతో ఈనెల 5న అతడి ఇంటివద్ద గడ్డి మందు తాగగా చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు అతడి తమ్ముడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన

కిర్లంపూడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడిలో అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన పడి పూజ ఘనంగా నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఆయన వెంట పాటంశెట్టి రమేష్, హరితేజ, ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, కాయల మణికంఠ, బచ్చల రాజు పాల్గొన్నారు.

నరేంద్రపట్నంలో...

జగ్గంపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం నరేంద్రపట్నంలో బుధవారం లక్ష బిల్వార్చన పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరేంద్రపట్నం స్వాములు ఆహ్వానం మేరకు జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. వీరస్వామి, రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, కాయల మణికంఠ, గంధం శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి



శంఖవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతంగి శివారు మైనింగ్ డంపింగ్ యార్డువద్ద దడాల మంగరాజు(50) అనే వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి అన్నవరం అడిషనల్ ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామానికి చెందిన మంగరాజు డంపింగ్ యార్డు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడని, ఆ ప్రదేశంలోనే మృతి చెంది ఉన్నాడన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సర్వీసు నెంబరు ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్ అమ్మేసుకున్నారు

గిరిజన రైతులకు విద్యుత్ అధికారుల కుచ్చుటోపీ


బాధితుడు సీతయ్య

కూనవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో అమాయక గిరిజనులను ఆసరాగా చేసుకుని విద్యుత్ అధికారులు మోసాలకు పాల్పడుతున్నారు. మండలంలో కోండ్రాజుపేట గ్రామానికి చెందిన మెట్ల సీతయ్య తన భూమిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులకు పూర్తిస్థాయిలో డబ్బులు కూడా ఇచ్చాడు. కొన్ని రోజులకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనట్లు గిరిజన రైతు సీతయ్యకు అధికారులు తెలిపారు. దానికి సంబంధించి 138 సర్వీస్ నెంబరు ఇచ్చి ఏడాది గడిచినా ట్రాన్స్‌ఫార్మర్ అందించకపోవడం విశేషం. ఇదిలా వుండగా మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మండలంలోని మరో రైతుకు అక్రమంగా అందజేసినట్లు సమాచారం. 2023లో విద్యుత్ శాఖలో పనిచేసిన ఓ ప్రధానాధికారి చేతివాటం కారణంగా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. మండలంలో విచారణ నిర్వహిస్తే మరికొన్ని అవకతవకలు బయటపడే అవకాశముంది.

డొంకరాయి పవర్ ప్లాంట్ సందర్శన



మోతుగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలోని పవర్ ప్లాంట్‌ను పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ గురువారం సందర్శించారు. భద్రతా చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏఈ విజయపాల్, జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

మోతుగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలో ఐసీడీఎస్ కార్యకర్తలు కరకా జయకుమారి, చింతల నాగమణి ఆధ్వర్యంలో 11 నుంచి 14 సంవత్సరాల వయసు గల కిశోర బాలలకు గంజాయి, వివిధ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీటీసీ కరకా వెంకటరమణ, ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. తద్వారా బంగారం లాంటి భవిష్యత్తు దెబ్బతింటుందని.. సమాజానికి, కుటుంబానికి నష్టం వాటిల్లుతుందన్నారు. యుక్త వయసు నుంచే మంచి నడవడిక అలవాటు చేసుకుని సమాజంలో ఉత్తమమైన పౌరులుగా గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. సదస్సులో వీఆర్వో సందీప్ ఆచార్యులు, సచివాలయ మహిళా పోలీసు బేబీ, జిల్లా పరిషత్ హైస్కూలు హెడ్‌మాస్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.